# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 01 ఆగస్టు 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 02

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




**ఏడుపాయల వద్ద వరద ఉధృతి**

భక్తులు రాకుండా హెచ్చరికలు జారీ

2లో..

# కాళేశ్వరం నివేదికపై మళ్లీ హైకోర్టుకు!



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ పార్టీ.. మరోమారు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని భావిస్తోంది. కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించిన ఆ పార్టీ.. మరోమారు మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)ను దాఖలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. సోమవారం హైకోర్టుకు వెళ్లేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది. శనివారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో పార్టీ అధినేత కేసీఆర్ కీలక నేతలతో సమావేశమయ్యారు. ఈ భేటీలో అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంతోపాటు పీసీ ఘోష్ కమిషన్‌పై కోర్టుకు వెళ్లే అంశంపై కేసీఆర్ పలు సూచనలు చేసినట్లు తెలిసింది. హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్ విచారణకు రాకమునుపే అసెంబ్లీలో ఘోష్ కమిషన్ నివేదికను పెట్టేందుకు రేవంత్ ప్రభుత్వం ఆదివారం కూడా అసెంబ్లీని నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు ఈ భేటీలో అభిప్రాయం వ్యక్తమైంది. ఒకవేళ అసెంబ్లీలో నివేదికను ప్రవేశ పెడితే వినిపించాల్సిన వాదనపై ఇప్పటికే హరీశ్‌రావు పూర్తిస్థాయిలో కసరత్తు చేసినట్లు సమాచారం. అయితే, అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ హాజరు కాకపోవటమే మంచిదని పార్టీ నేతలు చెప్పినట్లు తెలిసింది. అసెంబ్లీలో చోటు చేసుకునే పరిణామాల ఆధారంగా కేసీఆర్ హాజరయ్యేదీ లేనిదీ తెలుస్తుందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

**మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేసే యోచనలో బీఆర్ఎస్**

**అసెంబ్లీలో కాళేశ్వరంపై చర్చకు కేసీఆర్ హాజరుపై సందిగ్ధం**

**ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్‌రావు భేటీ**

**సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ పిటిషన్ వేసినట్లు సమాచారం**

**సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్!**

పీసీ ఘోష్ కమిషన్‌ను కొట్టేయడం లేదా స్టే కోసం బీఆర్ఎస్ సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించే అవకాశం ఉందన్న సమాచారంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కేవియట్ దాఖలు చేసినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయవద్దని ఆ కేవియట్‌లో కోరినట్లు సమాచారం. బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేస్తే... ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో వాదనలు వినిపిస్తామని పేర్కొన్నట్లు తెలిసింది.



# మెరుగైన బోధన దిశగా ప్రమాణాలు

**అన్ని విద్యా సంస్థల్లో ఫేషియల్ రికగ్నేషన్**

**విద్యాశాఖపై ఐసీసీలో సీఎం రేవంత్ సమీక్ష**

నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలు, పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనం కోసం ఒకే విభాగం కింద ఉండాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని.. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. కంటైనర్లపై సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సూచించారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అవసరమైతే కాంట్రాక్టు పద్ధతిలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.



2లో..

# లంబాడీ, సుగాలీ, బంజారాలు ఎస్టీలు కాదు

**వారిని జాబితా నుంచి తొలగించాలని పిటిషన్**

**విచారణ చేపట్టిన సుప్రీం...కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు**

లంబాడీ, సుగాలీ, బంజారాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మెరుగైన స్థానంలో ఉన్నారని పిటిషన్‌లో తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. వారిని ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల కోయ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది.





2లో..

# నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ

**కాళేశ్వరం, బిసి రిజర్వేషన్లపై చర్చ**

**ఏర్పాట్లను సమీక్షించిన స్పీకర్**

తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసుశాఖ ఉన్నతాధికారుల తో శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముందస్తు సమావేశం నిర్వహించారు.

# బీసీ రిజర్వేషన్లు, కాళేశ్వరం అంశాలే ప్రధానాస్త్రాలు



హైదరాబాద్: భాజపా నేతలు అసెంబ్లీలో ప్రభుత్వంపై సంధించాల్సిన వాగ్బాణాలను సిద్ధం చేసుకున్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు, కాళేశ్వరంలో అవినీతిపై చర్యల అంశాలను ప్రధానంగా ప్రస్తావించాలని నిర్ణయించారు. శనివారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో శుక్రవారం అసెంబ్లీలోని పార్టీ కార్యాలయంలో భాజపా శాసనసభా పక్ష సమావేశం నిర్వహించి... సభలో ప్రస్తావించాల్సిన అంశాలపై సభ్యులు చర్చించారు. అంతకుముందు భాజపా రాష్ట్ర కార్యాలయంలోనూ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కీలక నేతలు సమావేశమై ఇదే విషయంపై చర్చించారు. ఆ వివరాలను అసెంబ్లీ మీడియా పాయింట్‌లో, పార్టీ కార్యాలయంలో శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. "రాష్ట్రంలో 420 హామీలతోపాటు 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చేసిన ప్రకటనను పూర్తిగా విస్మరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని రేవంత్‌రెడ్డి పదేపదే చేసిన వ్యాఖ్యలు ప్రజలను మభ్యపెట్టడానికి మాత్రమే అన్నట్లు ఉంది. అందుకే ఇప్పటివరకు అవినీతిపరులపై ఒక్క కేసూ నమోదు చేయలేదు. ఒక్క రూపాయి రికవరీ చేయలేదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పూర్తి నివేదిక వచ్చిందని చెబుతున్నా.. విచారణను ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదు? సీబీఐ విచారణ ఎందుకు చేయించడం లేదు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలి' అని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.



## జీఎస్టీ శ్లాబ్‌ల హేతుబద్ధీకరణతో తెలంగాణకు రూ.7వేల కోట్ల నష్టం

దిల్లీ: "జీఎస్టీ లేకుండా ఇదివరకున్న వ్యాట్ విధానమే అమల్లో ఉండి ఉంటే 2024-25లో తెలంగాణకు రూ.69,373 కోట్ల ఆదాయం వచ్చేది. జీఎస్టీ ద్వారా దక్కింది రూ.42,443 కోట్లు మాత్రమే. ఒక్క ఏడాదిలోనే రూ.27 వేల కోట్లు నష్టపోయినట్లు లెక్క. ఇది అమల్లోకి వచ్చిన నాటి నుంచి మొత్తంగా రూ.83 వేల కోట్లు నష్టపోయాం. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మళ్లీ జీఎస్టీ శ్లాబ్‌ల హేతుబద్ధీకరణ చేస్తామని ప్రకటించింది. దీనివల్ల తెలంగాణ రూ.7 వేల కోట్ల ఆదాయం నష్టపోనుందని అంచనా. దాన్ని కేంద్రమే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి" అని తెలంగాణ ఆర్థిక మంత్రిత్వశాఖ బాధ్యతలు చూస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. హేతుబద్ధీకరణ వల్ల రాష్ట్రాలకు వాటిల్లే ఆదాయ నష్టం గురించి చర్చించడానికి శుక్రవారం ఇక్కడి కర్ణాటక భవన్‌లో ఎన్డీయేతర ప్రభుత్వాల మంత్రుల సమావేశం జరిగింది. అనంతరం భట్టి విలేకర్లతో మాట్లాడారు. "మొత్తం 8 రాష్ట్రాల మంత్రులు, అధికారులు హాజరై జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై సుదీర్ఘంగా చర్చించాం. ఇదివరకు జీఎస్టీ అమల్లోకి తెచ్చే క్రమంలో రాష్ట్రాలకు 14% వార్షిక వృద్ధిరేటు ఆధారంగా ఆదాయ భద్రత కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. కానీ అమల్లోకి వచ్చిన ఇన్నేళ్ల తర్వాతకూడా రాష్ట్రాల వార్షిక వృద్ధిరేటు 7-8% వద్దే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ ఇప్పుడు రాష్ట్రాల ఆదాయం మరింత తగ్గేలా చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. తెలంగాణ రూ.7వేల కోట్లు, మిగతా రాష్ట్రాలు రూ.7వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల మేర ఆదాయం నష్టపోయే పరిస్థితి ఉంది. అన్ని రాష్ట్రాలపైనా దీని ప్రభావం ఉంటుంది. రాజకీయకారణాలచేత కొన్ని రాష్ట్రాలు కేంద్రం ప్రతిపాదించిన మార్పులపై మాట్లాడటానికి ఇష్టపడకపోవచ్చు.



ఎటుచూసినా కన్నీటి జాడలే

# ప్రతినెలా రూ.7వేల కోట్ల వడ్డీ చెల్లింపు అబద్ధం

ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని, ప్రతినెలా రూ.7వేల కోట్లను రుణాలపై వడ్డీల కోసం చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం చెప్పడం పచ్చి అబద్ధమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. 'ఎక్స్' వేదికగా శుక్రవారం ఈ అంశంపై ఆయన స్పందించారు. "తెలంగాణ రాష్ట్రం ప్రతినెలా రూ.7వేల కోట్ల రుణవడ్డీ చెల్లిస్తోందంటూ ఇప్పటివరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు చేస్తున్న ప్రచారం అవాస్తవమని ఇటీవల కాగ్ నివేదిక స్పష్టంగా చెప్పింది. వాస్తవానికి గత నాలుగు నెలల్లో సగటు నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర రుణభారాన్ని ఎక్కువ చేసి చూపిస్తోంది. ప్రజలను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రజల జీవనం స్తంభించిపోయిందని ఆయన మరో ప్రకటనలో తెలిపారు. "ఈ వర్షాలతో పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తినష్టం జరిగింది. ప్రజలు సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా.. రూ.3,50,000 కోట్లతో 2036 ఒలింపిక్స్ నిర్వహణ, రూ.1,50,000 కోట్లతో మూసీ సుందరీకరణ, రూ.225 కోట్లతో చేపట్టనున్న హైదరాబాద్ బీచ్ ప్రాజెక్టుల గురించి చర్చలు జరుపుతున్నారు. ఇది ప్రజా పాలన కాదు' అని కేటీఆర్ ఆరోపించారు.

## నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శనివారం నుంచి అంటే.. ఆగస్టు 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై చర్చించ నున్నారు. తొలిరోజు దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సంతాపం ప్రకటిస్తారు.

నేటి నుండి ప్రారంభం కానున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసుశాఖ ఉన్నతాధికారుల తో శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముందస్తు సమావేశం నిర్వహించారు. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , డిప్యూటీ- చైర్మన్ శ్రీ బండా ప్రకాష్ ముదిరాజ్ ,లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి.

నరసింహా చార్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెక్రటరీ రఘునందన్ రావు, అడిషనల్ సెక్రటరీ (ఫైనాన్స్)- రాయ రవి, డైరెక్టర్ (ప్రోటోకాల్)- శివలింగయ్య హాజరయ్యారు. హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ- రవి గుప్తా, మహేష్ భగవత్, విక్రమ్ సింగ్ మాన్, సైబరాబాద్,రాచకొండ కమిషనర్లు సుధీర్ బాబు, అవినాష్ మహాంతి, ఇంటెలిజెన్స్ ఐజి- కార్తికేయ, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్- కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డిలు హాజరయ్యారు.

## ఆర్థిక పరిస్థితిపై తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వం

హైదరాబాద్:రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. రాష్ట్రం ప్రతి నెలా రూ.7,000 కోట్ల రుణ వడ్డీ చెల్లిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అయితే, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ఈ వాదన తప్పు అని తేల్చిందని స్పష్టం చేశారు. వాస్తవానికి, గత నాలుగు నెలల్లో సగటు- నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు- మాత్రమేనని (4 నెలల్లో రూ.9,355 కోట్లు-) పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర రుణభారాన్ని ఎక్కువ చేసి చూపిస్తుందని విమర్శించారు. తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రజల జీవనం స్తంభించిపోయిందని కెటిఆర్ అన్నారు. ఈ వర్షాల వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తినష్టం జరిగిందని, ప్రజలు సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా, విలాసవంతమైన, లాభదాయకమైన ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. రూ.3,50,000 కోట్ల 2036 ఒలింపిక్స్ నిర్వహణ, రూ.1,50,000 కోట్ల మూసీ సుందరీకరణ, రూ. 225 కోట్ల హైదరాబాద్ బీచ్ ప్రాజెక్టుల గురించి చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల గోడును గాలికొదిలేసి, డబ్బు సంపాదించే పనులపైనే రేవంత్ అండ్ కో దృష్టి పెట్టిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గు లేకుండా వ్యవహరిస్తుందని, ఇది ప్రజా పాలన కాదని ట్వీట్ చేశారు. కష్టాలను అధిగమించి మనకు స్ఫూర్తినిచ్చిన అద్భుతమైన క్రీడాకారులను మనం గౌరవించుకోవాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్ జయంతిని గుర్తు చేసుకుంటూ కెటిఆర్ టీ-÷-వట్ చేశారు. ఆటలు మనకు సహకారం, పోరాట స్ఫూర్తిని నేర్పిస్తాయని అన్నారు. 'మనం కిందపడితే అది ముఖ్యం కాదు, మళ్లీ ఎలా పైకి లేచామన్నదే ముఖ్యం' అని పేర్కొన్నారు.

## దెబ్బతిన్న పంచాయితీరాజ్ రోడ్ల పునరుద్దరణ

హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంచాయతీరాజ్ రహదారులను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలకు రహదారులు దెబ్బతిన్న నేపథ్యంలో సీతక్క పంచాయతీరాజ్ ఇఎన్‌సి ఎన్.అశోక్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దెబ్బతిన్న రహదారుల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 1291 ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నట్లు- ఇంజినీరింగ్ అధికారులు మంత్రికి నివేదించారు. వీటి తాత్కాలిక మరమ్మత్తుల కోసం రూ.22.71 కోట్లు-, శాశ్వత మరమ్మత్తుల కోసం రూ.352 కోట్లు-, మొత్తంగా గ్రామీణ రహదారుల పునరుద్ధరణకు రూ.374.71 కోట్లు- అవసరమని ప్రాథమికంగా అంచనా వేసినట్లు- తెలిపారు. మొత్తం 22 గ్రామాలకు రాకపోకలు దెబ్బతినగా, వాటిలో 14 గ్రామాలకు తాత్కాలికంగా రహదారులను పునరుద్ధరించామని వెల్లడించారు. మిగిలిన గ్రామాలకు పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నట్లు- ఇఎన్‌సి అశోక్ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా వీలైనంత త్వరగా రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్న గ్రామాలకు యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. వర్షాలకు తడిచి కూలే ప్రమాదం ఉన్న పంచాయతీరాజ్ భవనాలను తక్షణం ఖాళీ చేయించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు వేగంగా చేపట్టాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## ఏడుపాయల వద్ద వరద ఉధృతి

మెదక్‌ప్రముఖ దేవాలయం ఏడుపాయల టెంపుల్ వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆలయం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వరదనీరు దేవాలయం పైవరకు చేరుకుంది. వరద పొటెత్తడంతో దేవాలయం వైపు భక్తులు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కుండపోత వానలు పడుతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, నిజామాబాద్ తదితర జిల్లాల్లో వానలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కామారెడ్డి పట్టణం వరదల్లో చిక్కుకుంది. జిల్లాల్లోని పలు గ్రామాలు, తండాలను వరద ప్రవాహం ముంచెత్తింది. దీంతో వరద ప్ర భావిత ప్రాంతాల్లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి వరదల్లో చిక్కుకున్నవారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



# మెరుగైన బోధన దిశగా ప్రమాణాలు

హైదరాబాద్:పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని.. విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషినల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు మరింత పెంచాలని రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు- ప్రొఫెషనల్ విద్యాసంస్థల్లో లోటు-పాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యాశాఖపై ఐసీసీలో సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వేర్వేరు విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలు, పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనం కోసం ఒకే విభాగం కింద ఉండాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని.. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. కం-టైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. కంటైనర్లపై సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సూచించారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.



అవసరమైతే కాంట్రాక్టు పద్ధతిలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం ఆ
దేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని... ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. కం-టైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని.. కం-టైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సీఎం సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టు-బడిగా చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు- విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి
పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు
వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు దెబ్బమీద దెబ్బ !

ఇప్పటికే యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడ్డ రైతులపై దెబ్బమీద దెబ్బ అన్నట్లుగా అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీసాయి. పలు జిల్లాల్లో విపరీతమైన భారీ వర్షాలతో పంటలన్నీ నీటమునిగాయి. వేసిన పంటలన్నీ నీటి పాలయ్యాయి. పెట్టుబడులు పూర్తిగా తుడిచి పెట్టుకు పోయాయి. అనేక జిల్లాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఉత్తకాది రాష్ట్రాల్లోనూ ఇలాగే ఉంది. వరదలు వచ్చిన ప్రతిసారీ పంటనష్టం సకాలంలో అందడం లేదు. ప్రభుత్వం నష్టం అంచనా వేసి ఇచ్చే అరకొర పరిహారం కూడా ఎప్పుడు అందుతుందో తెలియదు. ఇకపోతే యూరియా సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. దీనిని బట్టి రైతులు ఎంతగా ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసు కోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత మాత్రాన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టడం తగదు. బిజెపి నేతలు కూడా స్థానిక సమస్యపై చర్చించకుండా ఇక్కడి ప్రభుత్వంపైనే నిందలు వేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం పలుమార్లు విన్నవించినా పెద్దగా స్పందించలేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కేటాయించిన ఎరువులు కోటాను పరిశీలిస్తే తెలంగాణపై కొంత పక్షపాతం చూపిస్తున్నట్టుగానే కనిపిస్తోంది. ఈ సంవత్సరం పంటల సేద్యం పెరగవచ్చుననే దృష్టితో రాష్ట్రం 20 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించాలని కోరితే, రాష్ట్రానికేంద్రం కేటాయించింది 9.80 లక్షల టన్నులు మాత్రమే. ఆగస్టు ఆఖరినాటికి 8.30 లక్షల టన్నులు సరఫరా చేయాల్సిఉండగా ఈనెల ఆఖరికి వచ్చింది 5.66 లక్షల టన్నులు మాత్రమే. ఆ వివరాలు వ్యవసాయశాఖ మంత్రి పత్రికా ముఖంగా వివరించారు. ఇంకా సుమారు 3 లక్షల టన్నుల లోటు ఉండటం.. సకాలంలో కేంద్రం సరఫరా చేయకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఎప్పటికప్పుడు వస్తున్న ఎరువులను మానిటరింగ్ చేస్తూ యూరియాను డిమాండ్ ఉన్న ప్రాంతానికి పంపిస్తున్నామని, రైతులు ఎరువులు దొరకవని ఆందోళన చెందనవసరం లేదని ప్రభుత్వంప్రకటించింది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నాయకులు.. పాలకుల వైఫల్యమే అంటూ, ఎరువులు సరఫరా చేయలేని చేతకాని ప్రభుత్వాలంటూ విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. విమర్శలు, మాటలు పక్కకుపెట్టి యుద్ధప్రాతిపదికన ఎరువులు సరఫరా జరిగేలా చూడమని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలు పరిశీలించకుండా రాష్ట్రంలో ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటున్నారు. రైతులు రాత్రింబవళ్లు సహకార బ్యాంకు గోదాముల వద్ద క్యూలైన్లో ఉంటూ.. పట్టా పాస్ బుక్కులు, చివరికి చెప్పులు కూడా క్యూలైన్లలో పెడుతూ, లైన్ లో ఘర్షణలు పడుతూ, కొన్నిచోట్ల లాఠీచార్జీలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఎందుకు ఈ పరిస్థితి వచ్చింది? దీనికి బాధ్యులు ఎవరన్నది ఆలోచించాలి. రాష్ట్రాలకు యూరియా కేటాయింపులు, సరఫరా పూర్తిగా కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఉంటాయి. రాష్ట్రం గత ఏడాది వేసిన పంటలను దృష్టిలో పెట్టుకుని 10 శాతం విస్తీర్ణం పెరుగుతుందని అంచనా వేస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఖరీఫ్ సీజన్ రాకముందే ప్రణాళిక రూపొందించి, 20 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు కావాలని కేంద్రాన్ని కోరింది. గతంలో ఇచ్చిన 2 లక్షల టన్నులు ఇప్పటికే రాష్ట్రం వద్ద నిల్వలు ఉన్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఎప్పటికప్పుడు పంపుతున్నామని.. రూ. 80,000 కోట్లు సబ్సిడీ భరించామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. యూరియాపై ప్రభుత్వం భరిస్తున్న సబ్సిడీ ఎక్కువగా ఉంది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. చైనా నుంచే 20 శాతం దిగుమతి చేసుకోవాలి. సబ్సిడీని తగ్గించుకొనే ఎత్తులో భాగంగా తక్కువలో తెప్పించుకొనే ప్రయత్నం చేస్తుందని కేంద్రంపై విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా అన్నదాతలకు అగచాట్లు- తప్పట్లేదు. ప్రస్తుతం వేసిన పంటలకు 15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వాన్ని కోరుతోంది. దాంతో డిమాండు ఎక్కువగా ఉండి.. సరఫరా తక్కువగా ఉండటంతో.. పంపిణీ కేంద్రాల దగ్గర వేకువ జాము నుంచే పడిగాపులు కాస్తున్నప్పటికీ సరుకు కొంతమందికే అందటంతో ఆందోళన మొదలయ్యింది. డిమాండును అడ్డుపెట్టుకొని పలుచోట్ల నల్ల బజారు విక్రయాలు యధేచ్ఛగా రూ.266 బస్తాను రూ. 400 వరకు అమ్ముతున్నారని విమర్శలు వస్తున్నాయి. పారిశ్రామిక అవసరాల కోసం వ్యవసాయ యూరియాను దారి మళ్లిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అతిగా రసాయన ఎరువుల వినియోగం, పంట మార్పిడి విధానం లేనందున నేలలో మంచి బ్యాక్టీరియా నశిస్తుంది. అతిగా నీరు పెట్టడం, ఎరువులు, రసాయనాలు వాడటం వల్ల భూసారం క్షీణిస్తుంది. రసాయన ఎరువులు, గుమ్మరిస్తే ఫల సాయం రెట్టింపు కాదు. దీనిపై రైతాంగంలో అవగాహన పెంచడంలో ప్రభుత్వాల వైఫల్యం.. మన ఆహార భద్రతనే ప్రమాదంలోనికి నడుతుంది. సాగు భూములను కాపాడుకోవాలంటే ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు నిర్వహిస్తూ, తగినంత పరిణామంలోనే ఎరువులు చల్లేలా అన్నదాతను చైతన్య పరచాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి హెచ్చరించింది. అయితే మోడీ నేతృత్వంలోని కేందప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క రైతు అనుకూల నిర్ణయం తీసుకోలేదు. అప్పుడప్పుడూ మద్దతు ధరలు పెంచడం తప్ప చేసిందేమీ లేదు. రైతుల సంఘాల నుంచి వ్యతిరేకతలు, ఆందోళనలు వస్తున్నా చర్చించడం లేదు. సాగుచట్టాలు తీసుకుని వచ్చాక అవి ఎందుకు మంచివో చెప్పలేక పోయింది. వాటిని రద్దుచేస్తున్న సమయంలోనూ ఎందుకు రద్దు చేస్తుందో చెప్పలేదు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా జాతీయ సాగు విధానం తీసుకుని రావవడంలోనూ.. దేశీయంగా పంటలను ప్రోత్సహించడంలోనూ విఫలమయ్యింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న మోడీ పండించిన పంటలను కొనుగోలు చేసే దిక్కు లేకుండా చేసింది. దేశీయంగా
పంటలు పండుతున్నా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో రైతులు పోరుబాట పడుతున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడే విధానాలు రావాలి. అందుకు తగిన కృషి చేయాలి.

## యూరియా సరఫరాలో అరకొర కేటాయింపులు

### రైతుల అవస్థలు పట్టించుకోని ప్రభుత్వాలు

అనురావతి: ఎరువులకు కొరత లేదని, త్వరలోనే యూరియా వచ్చేస్తుందని సర్కారు చెబుతుండగా పరిస్థితి అంత ఆశాజనకంగా ఏమీ లేదు. గత ఖరీఫ్ రాష్ట్రంలో 6.32 లక్షల టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయి. 2025 ఖరీఎ÷-లో కేంద్రం 6.22 లక్షల టన్నులకు కేటాయింపు తగ్గించింది. ప్రభుత్వ గణాంకాల మేరకు... నెల వారీ అవసరాల మేరకు ఆగస్టుకు 4.67 లక్షల టన్నులు కావాలి. ఇప్పటికి 3.37 లక్షల టన్నులు వచ్చాయంటోంది. ప్రారంభ నిల్వలతో కలిపి 4.82 లక్షల టన్నులు అమ్ముడయ్యాయి. ఇంకా 1.52 లక్షల టన్నులు అందుబాటు-లో ఉన్నాయి. విజయనగరం, మన్యం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆగస్టుకు అవసరమైన యూరియాలో భారీ లోటు- నెలకొంది. మార్క్‌ఫెడ్ తీసుకున్న 70 శాతం యూరియాను తమ గోదాములలో నిల్వపెట్టి బాగా ఇబ్బంది ఉన్న ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు (పిఎసిఎస్), రైతు సేవా కేంద్రాలకు (ఆర్ఎస్) పంపుతామంటోంది. ఆ విధంగా పంపిన యూరియాలో అధిక భాగం స్థానిక అధికార కూటమి నాయకుల నియంత్రణలోకి వెళుతోంది. ఒక వైపు మార్కెట్లో యూరియా కనిపించకపోవడం మరోవైపు సహకార సంస్థలకు చేరిన ఎరువు సక్రమ పద్ధతిలో పంపిణీ జరగకపోవడంతో రైతులకు యూరియా అగచాట్లు- మరింత పెరిగాయి. రైతుల యూరియా కష్టాలను పరిష్కరించాల్సిన రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వం తన అనాలోచిత నిర్ణయాలతో మరిన్ని సమస్యలను సృష్టిస్తోంది. సబ్సిడీ భారాన్ని తగ్గించుకునేదాంట్లో భాగంగా యూరియా కేటాయింపులను తగ్గించిన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రాని అవసరమైన యూరియాను సాధించే బదులు, ఇక్కడికి వచ్చిన ఎరువులో అత్యధిక వంతు తానే తీసుకొని రైతులకు పంపిణీ చేయ నిశ్చయించడంతో కొత్త సమస్య ముందుకొచ్చింది. కేంద్రం నుంచి ఎపికి దిగుమతవుతున్న యూరియాలో 70 శాతం మార్క్ఫెడ్కు, తతిమ్మా 30 శాతం ప్రైవేటు డీలర్లకు అంది. ప్రభుత్వ ఈ చర్యను ఎరువుల కంపెనీలు, డీలర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సరిగ్గా యూరియా కొరత తలెత్తిన సమయంలో సర్కార్ తన వాటా పెంచడంతో కంపెనీలు రాష్ట్రానికి యూరియాను దాదాపు బంద్ చేశాయి. తాము యూరియా వ్యాపారం చేయబోమని డీలర్లు మొరాయిస్తున్నారు. దాంతో మార్కెట్లో అమాంతం యూరియా కనిపించని విపత్కర పరిస్థితి నెలకొంది. ఈ పరిణామంతో యూరియా కొరత మరింత తీవ్రమై రైతుల్లో ఆందోళన అధికమైంది.

## ఉపరాష్ట్రపతి ఎన్నికలపై బిఆర్ఎస్ అనాసక్తి

### ఎన్నికకు దూరంగా ఉండాలనేయోచనలో పార్టీ?

హైదరాబాద్,ఆగస్ట్29(ఆర్ఎన్ఎ): ఉప రా ష్ట్రపతి ఎన్నికల సమయం దదగ్గర పడుతున్నా విపక్ష బిఆర్ఎస్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాంగ్రెస్, ఎన్‌డిఎ కూటమిలకు తాము దూరమని ఇప్పటికే కెటిఆర్ ప్రకటించారు. ఈ రెండింటి వల్ల ఒరిగిందేమీ లేదని అంటోంది. దీనిని బట్టి చూస్తుంటే ఉప రాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉండాల ని బిఆర్ఎస్ పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఎన్నికల్లో పాల్గొనడం వల్ల వచ్చే ఉపయోగం ఏమీ లేదని కెటిఆర్ గట్టిగానే వాదిస్తున్నారు. దీంతో వచ్చే నెల 9న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నకిలో ఎన్‌డిఎ అభ్య ర్థికి గానీ, విపక్షాల అభ్యర్థికి గానీ ఓటు వేయకుండా తటస్థంగా ఉండాలని పా ర్ట అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్రా నికి సెప్టెంబర్ 9లోపు ఎవరు 2 లక్షల టన్నుల ఎరువులు తీసుకువస్తా రో ఆ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి బిఆర్ ఎస్ మద్దతు ఇస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తేల్చి చెప్పారు. అయితే ఇప్పటివరకు కెటిఆర్ డిమాండ్ పై కాంగ్రెస్ పార్టీ కానీ, బిజెపి పార్టీ స్పందించలేదు.
నిజానికి యూరియా సమస్య కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉంటుంది. దీనికి కాంగ్రెస్‌తో పెద్దగా సంబంధం లేదు. అందువల్ల అధికార పార్టీ యూరియా సరఫరా చేస్తే బిజెపికి మద్దతు ఇచ్చే అవకాశం ఉంది.

## ఆయల్‌పామ్‌కు అనుకూల వాతావరణం

ఖమ్మం: రాష్ట్రంలో ఆయిల్ పాం సాగుకు అనుకూల వాతావరణం ఉందని, దీంతో జిల్లాలో రైతులను పెద్ద ఎత్తున ప్రోత్స హిస్తున్నారు. పంట పెట్టుబడులను తగ్గించే ప్రయత్నంలో భాగంగా అనేక జిల్లాల్లో ఆయిల్ పామ్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందచేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దీనిని కొనసాగిస్తోంది. ప్రత్యేకించి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కూడా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు పదేపదే ఇదే విషయం చెప్పి వారిని ఆయిల్ పామ్ సాగువైపు మళ్లేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున సాగు చేసేందుకు ముందు కొచ్చారు. దీనికి సంబంధించి హార్టికల్చర్ శాఖ ఒక నివేదిక రూపొందించింది. ఖమ్మం, సిద్దిపేట, నిజామాబాద్ తదితర జిల్లాల్లో ఇప్పటికే సాగు చేపట్టారు. వాతారణంతో పాటు,నీటి లభ్యత కూడా ఎక్కువగా ఉందని అధికారులు అంచనాకు వచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం,వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పంట సాగు చేసేందుకు అనుకూలంగా ఉంది. నూనె గింజల ఉత్పత్తికి ఉష్ణోగ్రతలు,సాగుకు అనుగుణంగా దిగుబడి ఇచ్చే నేలలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఫలితంగా రైతాంగం ఆయిల్ పాం సాగుకు ఆసక్తి చూపుతు న్నారు. ఎకరా వరి సాగయ్యే నీటితో మూడెకరాల పామాయిల్ పంట సాగవుతుందని, అంతర పంటలతో అధిక లాభాలు వస్తాయని
చెబుతున్నారు. ఆయిల్ పాం సాగుపై మొదటి నుంచీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు వర్షాలు కురిసి నీరు సమృద్ధిగా ఉంటే వరి పండిస్తున్నారు. ఆయిల్ పాం ప్రత్నామ్నాయ పంట కానుంది. రాబోయే రెండేండ్లలో తెలంగాణ వ్యాప్తంగా 42,250 ఎకరాల్లో సాగుచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కుంది. ఇప్పటికే 2,500 ఎకరాల్లో తెలంగాణ ఉద్యానవన శాఖ ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. మొత్తం 246 మండలాలు అనుకూలంగా ఉన్నట్లు సర్వేలో తేలింది. ఈ సాగు వల్ల రైతులను పంట మార్పిడి వైపు ప్రోత్సహించినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.అందుకే దీనివైపు రైతులు మొగ్గు చూపేలా చేస్తోంది. ఖమ్మం, నిజామబాద్ లాంటి జిల్లాలు ప్రయోగాలకు ప్రసిద్ధం. ఇప్పటికైతే ఇక్కడ అడుగు పడలేదు. అయితే ఏదైనా పంటప్రయోగం జరగగాలంటే ఇక్కడి రైతులు ముందుకు వస్తారు. వ్యవసాయశాఖ ఈ మేరకు ఆయా జిల్లాల్లో అనుకూలంగా ఉన్న పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ప్రోత్సాహం అందించడంతో పాటు సబ్సిడీ కూడా అందుతున్న కారణంగా ఆయిల్ పామ్ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయిల్ పామ్ సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. మొక్కదశ నుంచి మార్కెటింగ్ వరకు అన్ని రకాలుగా సాయం చేయనుంది. రైతులకు మొక్కను రూ.25లకే అందిస్తారు. మొక్కలను కూడా ఉపాధిహామీ పథకం కింద అధికారులు నాటించనున్నారు. మొక్కలను పెంచడానికి ఈ ప్రాంతంలోనే అధికారులు నర్సరీని కూడా ఏర్పాటు చేయనున్నారు. సబ్సిడీపై వారికి డ్రిప్ పరికరాలు ఇవ్వనున్నారు. మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు
జైపూర్ వద్ద ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నారు. దీంతో రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కోసం తిప్పలు కూడా తప్పనున్నాయి. ఇక సాగు విషయానికి వస్తే ఖర్చు కూడా తక్కువగా ఉంటుందని, నామమాత్రపు ఎరువులు వాడితే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

## గిడుగు రామ్మూర్తి జయంతి

విజయనగరం:తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడైన గిడుగు వెంకట రామమూర్తి తెలుగు కోసం ఎంతగానో కృషి చేశారు. ఆయన ఉద్యమ ఫలితంగా వాడుక భాషకు మర్యాద దక్కింది. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, తెలుగులో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడైనారు. గిడుగు రామ్మూర్తి జనవరి 22, 1940న మరణించారు. గిడుగు రామ్మూర్తి జయంతి ఆగస్టు 29 ని 'తెలుగు భాషా దినోత్సవం' గా జరుపుకుంటున్నాము. ఆగష్టు 29, 1863న శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేట గ్రామంలో జన్మించారు. తండ్రి వీర్రాజు పర్వతాలపేట ఠాణాలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తుండేవారు. చిన్న వయస్సులోనే రామమూర్తి తండ్రిని కోల్పోయారు. విజయనగరంలో మేనమామగారి ఇంట్లో ఉంటూ రామమూర్తి చదువు కొనసాగించారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం చేయాలి.

**సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్.**

**కామారెడ్డి వరద బాధితుల పరామర్శించిన సిపిఎం బృందం.**



**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:**

వరద బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం సహాయం చేయాలనీ సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.కామారెడ్డి పట్టణంలో వరద ముంపుకు గురైన ప్రాంతాలను సిపిఎం రాష్ట్ర బృందం శుక్రవారం సందర్శించింది. రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ వెంట సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు డీజే నరసింహారావు, ఆర్ వెంకట్ రాములు, శోభన్ నాయక్ లు పర్యటించారు. వీటితోపాటు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ బృందం ఉంది. ఇంటింటికి తిరిగి బాధిత కుటుంబాలతో మాట్లాడారు. అదే సందర్భంలో అక్కడికి వచ్చిన కలెక్టర్ ను నిలదీశారు. కనీసం ప్రజలకు త్రాగడానికి మంచి నీళ్లు, ఆహారం, కరెంటు అందుబాటులోకి తేవాలని అన్నారు. వరదలో కొట్టుకొచ్చిన రాళ్లు రప్ప చెత్తాచెదారం ఇంట్లో చేరి బురదమయం అయ్యిందని అన్నారు. ఇంట్లోకి పాములు కూడా వచ్చాయని అన్నారు. అనంతరం సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ, కామారెడ్డి పట్టణంలో వరదను అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేసుంటే ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగి ఉండేది కాదని అన్నారు. వరదల వల్ల బిఆర్ నగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, జిఆర్ కాలనీ కౌండిన్య నగర్ లలో జాన్ వెస్లీ ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. వందలాది ఇండ్లలోకి వరద నీరు చేరి నిత్యవసర వస్తువులన్నీ కొట్టుకుపోయాయి. ఫస్ట్ ఫ్లోర్ వరకు అన్ని ఇండ్లు పూర్తిగా నీటిలో మునిగిపోయాయనితో వందలాది కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డు మీద పడ్డారని వారికి జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం తక్షణంగా భోజన సౌకర్యాలు, నీటి సౌకర్యాలు కల్పించాలని, వారికి నష్టపరిహారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి పట్టణంలో జిల్లా వ్యాప్తంగా కూడా వరదల వల్ల అనేక గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాలు లేక త్రాగునీరు లేక ఎటు వెళ్లలేని పరిస్థితిలో ప్రజలు వెల్లదీస్తున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి అలాంటి గ్రామాలను గుర్తించి వారికి తక్షణం ఆహారం మీరు అదే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ బృందం జిల్లా కలెక్టర్ ఆశిష్ కి తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు
చేపడతామని చెప్పారు.

కామారెడ్డి నియోజకవర్గంలో
దెబ్బతిన్న పంట పొలాలను, రోడ్లను వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి కేంద్ర బృందాన్ని పంపించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి శాసనసభ్యులు కూడా దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో నష్టపోయిన ఉత్తర తెలంగాణ.

**కేంద్ర ప్రభుత్వం రూ" 20 వేల కోట్ల గ్రాంట్ ను వెంటనే విడుదల చేయాలి.**

**బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్ :**



అకాల వర్షాలతో 20 వేల ఎకరాల్లో పంటలు నష్టపోయి రైతాంగాన్ని, ఇళ్లు, వాహనాలు, ఆస్తులు కోల్పోయిన ప్రజలను కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) బిఎల్పి రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ .హైదరాబాద్ నల్లకుంట లోగల రాష్ట్ర కార్యాలయం నుండి విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన స్పందించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల అకాల వర్షాలతో కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, , రాజన్న సిరిసిల్ల,నిర్మల్ తదితర ఉత్తర తెలంగాణ జిల్లాల పరిదిలో దాదాపు 20 వేల ఎకరాల్లో పంటలు నష్టపోయి రైతాంగాన్ని, ఇళ్లు , వాహనాలు, ఆస్తులు కోల్పోయిన ప్రజలను కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వెంటనే 20 వేల కోట్ల రూపాయల గ్రాంట్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
అదేవిధంగా భారీ వర్షాలతో ఉత్తర తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు, మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ లైన్లు యుద్ధ ప్రాతిపదికన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

# అనారోగ్య సమస్యతో బాధపడుతున్న స్మితా సబర్వాల్..



తెలంగాణ: సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్ చేసిన పోస్ట్ ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జీవితంలో గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నానని.. ఇప్పుడిప్పుడే నెమ్మదిగా వాటి నుంచి కోలుకుంటున్నాను అంటూ ఆమె చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఇదిలా ఉంటే స్మితా సబర్వాల్ ఆరు నెలలు అనగా సెప్టెంబర్ 1 నుంచి 2026 జనవరి 31 వరకు సెలవు తీసుకున్నారు. చైల్డ్ కేర్ లీవ్ తీసుకుంటున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు మీ కోసం..

సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ గురించి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వంలో స్మితా సబర్వాల్ కు అద్భుతమైన పరిపాలనా అవకాశం లభించింది. తన పనితీరుతో ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. విధి నిర్వహణలోనే కాక సోషల్ మీడియాలో కూడా ఆమె చాలా యాక్టీవ్‌గా ఉంటారు. అప్పుడప్పుడు వివాదాస్పద వ్యాఖ్యలు, బోల్డ్ స్టేట్‌మెంట్స్ పోస్ట్ చేస్తూ.. వార్తల్లో నిలుస్తుంటారు. ఇక తాజాగా మరోసారి స్మితా సబర్వాల్ పేరు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కారణం ఆమె చేసిన ఓ పోస్ట్.

తాజాగా స్మితా సబర్వాల్ ఎక్స్ వేదికగా ఒక ఆసక్తికర పోస్ట్ చేశారు. కొన్ని గడ్డు పరిస్థితులును ఎదుర్కొన్నానని.. కానీ ప్రస్తుతం తాను వాటి నుంచి నెమ్మదిగా బయటపడగలుగుతున్నాను అంటూ చెప్పుకొచ్చారు. తన పోస్ట్‌లో స్మితా సబర్వాల్.. 'కొన్ని సార్లు మన జీవితాల్లో చాలా ప్రశాంతంగా ఉన్న సమయాలు.. మనకు చాలా గట్టి సమాధానాలు చెబుతాయి. నా వ్యక్తిగత విషయాలకు వస్తే.. అనారోగ్య సమస్య వెలుగులోకి వచ్చింది. మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళమైన కశేరుక ధమనిలో చీలిక వచ్చిందని తెలిసి నా ప్రపంచం ఒక్కసారిగా షేక్ అయ్యింది.ఈ బాధాకరమైన విషయాల నుంచి నెమ్మదిగా కోలుకుంటున్నాను. చాలా కష్టంగా ఉన్నప్పటికీ... నేను కోలుకుంటు న్నాను. ప్రతిరోజు ఎంతో కొంత మనో ధైర్యాన్ని అలవర్చుకుంటున్నాను' అని ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈపోస్ట్ నెట్టింట తెగ వైరలవుతుంది.

ఈ పోస్ట్ చూసిన నెటిజనులు.. మీకు ఏం జరిగిందో మాకు తెలియదు కానీ.. మీరు మాత్రం త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాము మేడం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. వారందరికి స్మితా సబర్వాల్ ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం స్మితా సబర్వాల్ వెకేషన్ కోసం విదేశాలకు వెళ్లినట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉంటే స్మితా సబర్వాల్ లాంగ్ లీవ్ పెట్టిన సంగతి తెలిసిందే.

వచ్చే నెల అనగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది అంటే

2026, జనవరి 31వ తేదీ వరకు ఆమె ఆరు నెలలు సెలవులు తీసుకున్నారు. ప్రస్తుతం స్మితా సబర్వాల్ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ ఆరు నెలలు ఆమె చైల్డ్ కేర్ లీవ్ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే స్మితా సబర్వాల్‌కు వచ్చిన అనారోగ్య సమస్య ఏంటి.. దాని లక్షణాలు ఎలా ఉంటాయి..

# తెలంగాణకు మరో కొత్త రైల్వే ప్రాజెక్ట్..

తెలంగాణ: తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పింది. రాష్ట్రానికి కొత్త రైల్వే ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. దీని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సుమారు 5 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించ నుంది. ఈ రైల్వే లైన్‌కు మరో ప్రాముఖ్యత కూడా ఉంది. రాష్ట్రం నుంచి మొదటిసారిగా 4లైన్ల ఇంటర్ స్టేట్ రైలు మార్గంగా ఇది నిలవనుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రి వర్గం సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలకు లబ్ధి చేకూర్చేలా.. రూ.12,328 కోట్ల విలువైన 4 కొత్త రైల్వే ప్రాజెక్ట్‌లకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.



కేంద్రం ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల్లో తెలంగాణకు సంబంధించి సికింద్రాబాద్-వాడి మార్గం కూడా ఉంది. ఈ రెండు ప్రాంతాల మధ్య మల్టీ ట్రాకింగ్ నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రానున్న 5 సంవత్సరాల్లో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రూ.5,102 కోట్లతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టనున్నారు. వచ్చే సంవత్సరం అనగా 2026 కేంద్ర బడ్జెట్‌లో దీనికి నిధులు కేటాయించనున్నారు. మరో ఐదు సంవత్సరాల్లో దీన్ని పూర్తి చేయాలని కేంద్రం భావిస్తుంది.

ప్రస్తుతం సికింద్రాబాద్(సనత్‌నగర్)-వాడి మధ్య డబుల్ ట్రాక్ ఉంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో 3, 4వ మార్గం పనులు మొదలుపెట్టనున్నారు. ఇది పూర్తయ్యి అందుబాటులోకి వస్తే.. తెలంగాణ నుంచి ముంబై ప్రయాణించే రైళ్లు వేగంగా గమ్యస్థానాలకు చేరడమే కాక.. మరికొన్ని కొత్త రైళ్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది అంటున్నారు. సికింద్రాబాద్-వాడి మార్గం ఎక్కువ రద్దీ ఉండే రూట్లలో ఒకటి. ఈ మార్గంలో సికింద్రాబాద్ నుంచి పుణెకు వెళ్లే శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌తో పాటుగా.. ముంబై వెళ్లే హుస్సేన్‌సాగర్, ఎల్‌టీటీ ముంబయి వంటి ట్రైన్స్ వికారాబాద్-వాడి మార్గంలో ప్రయాణాలు సాగిస్తుంటాయి.

ఈ మార్గం కిటకిటలాడుతూ ఉంటుంది. ఇక ఈ రూట్లో.. ఎక్కువ సిమెంట్ ఇండస్ట్రీ లున్నాయి. అలానే ఈ మార్గంలో వేర్వేరు ప్రాంతాలకు సిమెంట్, స్టీల్‌తో పాటుగా వ్యవసాయ ఉత్పత్తులు కూడా రవాణా అవుతుంటాయి. ఈ రూట్ మొత్తం మీద 173 కి.మీ. మేర నాలుగు లైన్లుగా చేయనున్నారు. కర్ణాటకలో 49 కిమీ, తెలంగాణలో 124 ఉంది. ఇది అందుబాటు లోకి వస్తే.. రద్దీ తగ్గడమే కాక మరిన్ని కొత్త రైళ్ల సంఖ్య పెరుగుతుంది అంటున్నారు.

# బిగ్‌బాస్ కంటెస్టెంట్ లోబోకు జైలు శిక్ష..

జనగామ: ఏడేళ్ల నాటి కేసులో టీవీ నటుడు, బిగ్‌బాస్ కంటెస్టెంట్, యాంకర్ లోబోకు గట్టి షాక్ తగిలింది. అతడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. అలానే రూ.12,500లు జరిమానా కూడా విధించింది. ఇంతకు ఏ కేసులో కోర్టు లోబోకు జైలు శిక్ష విధించింది అంటే.. ఏడు సంవత్సరాల క్రితం జరిగిన ఓ యాక్సిడెంట్ కేసులో ఈ తీర్పు వెల్లడయ్యింది. తన కారులో వరంగల్ నుంచి హైదరాబాద్ వస్తున్న లోబో.. రఘునాథపల్లి మండలం వద్ద ఓ ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించగా.. కొందరికి గాయాలయ్యాయి. నాడు నమోదైన కేసులో తాజాగా లోబోకు కోర్టు శిక్ష విధించింది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించడమే కాక మరికొందరు గాయపడటానికి కారణమైన లోబోకు జనగామ కోర్టు సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది.



జనగామ జిల్లా రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐలు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడు సంవత్సరాల క్రితం అనగా.. 2018, మే 21న లోబో ఓ టీవీ ఛానల్ కార్యక్రమం కోసం వీడియో షూట్ చేయడానికి గాను.. తన టీమ్‌తో కలిసి వరంగల్ జిల్లాలోని లక్నవరం, భద్రకాళి చెరువు, రామప్ప, వేయిస్తంభాల ఆలయం వంటి ప్రాంతాల్లో పర్యటించారు. ఆ తర్వాత వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ సమయంలో లోబోనే స్వయంగా కారు నడిపారు. ఈక్రమంలో లోబో కారు డ్రైవ్ చేస్తూ హైదరాబాద్‌కు వస్తుండగా.. రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద యాక్సిడెంట్ జరిగింది. లోబో తన కారుకు ఎదురుగా వచ్చిన ఓ ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో మేడె కుమార్, పెంబర్తి మణెమ్మలు అనే ఇద్దరు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూనే చనిపోయారు. అలానే ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మరి కొందరికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో లోబో, అతడి టీమ్ ప్రయాణిస్తున్న కారు కూడా బోల్తా పడింది. దీంతో వారికి కూడా స్వల్ప గాయాలయ్యాయి.

ఈప్రమాదం గురించి మృతుల కుటుంబ సభ్యుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి రఘునాథపల్లి పోలీసులు లోబోపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో తాజాగా జనగామ కోర్టు తీర్పు వెల్లడించింది. యాక్సిడెంట్ చేసి ఇద్దరి మృతికి కారణమైనందుకు గాను లోబోకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.12,500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించిందని.. పోలీసులు తెలిపారు. మరి దీనిపై లోబో రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.

# సెప్టెంబర్ 1న రేషన్ షాపులు బంద్



తెలంగాణ: రేషన్ డీలర్లు ప్రభుత్వానికి షాక్ ఇచ్చేందుకు రెడీ అయ్యారు. సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రంలో రేషన్ షాపులు బంద్ చేయనున్నట్లు ప్రకటించారు. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ డీలర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం తమ సమస్యపై స్పందించకపోతే సెప్టెంబర్ 4న అసెంబ్లీని ముట్టడిస్తామని డీలర్లు హెచ్చరించారు. ఐదు నెలలుగా కమీషన్ బకాయిలు చెల్లించలేదని తెలిపారు. మరి దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

ఒకేసారి మూడు నెలల రేషన్ పంపిణీ తర్వాత.. వచ్చే నెల అనగా సెప్టెంబర్ 1 నుంచి మళ్లీ రేషన్ పంపిణీ మొదలు కావాల్సి ఉంది. దీనికి మరో రెండు రోజులు సమయం మాత్రమే ఉండగా.. చివరి నిమిషంలో రేషన్ డీలర్లు ఊహించని షాకిచ్చారు. సెప్టెంబర్ 1 నుంచి రేషన్ షాపులు బంద్ చేస్తామని తెలిపారు. ఈ మేరకు రేషన్ డీలర్లు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. అసలేం జరిగింది.. ఎందుకు రేషన్ డీలర్లు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారంటే.. పెండింగ్ బకాయిల విడుదల కోసం రేషన్ డీలర్లు పోరు బాట పట్టారు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాలు బంద్ చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేసేది లేదని తేల్చి చెప్పారు. బియ్యం పంపిణీ కమీషన్ బకాయిల విడుదల గురించి ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా లాభం లేకుండా పోతుందని.. ఈ సమస్య పరిష్కారం కోసమే తాము సెప్టెంబర్ 1 నుంచి రేషన్ షాపులు బంద్ చేయబోతున్నట్లు ప్రకటించారు. రేషన్ బియ్యం పంపిణీ బకాయిలను తక్షణమే రిలీజ్ చేయాలని కోరుతూ.. గురువారం నాడు రేషన్ డీలర్లు.. రాష్ట్ర పౌరసరఫరాల భవన్ ఎదుట నిరసన తెలిపారు. సెప్టెంబర్ 1న రేషన్ దుకాణాల బంద్ గురించి వారు ప్రకటన చేశారు. అలానే వారి ఆందోళనకు సంబంధించిన కార్యాచర ణను కూడా ఈ సందర్భంగా వెల్లడించారు.

బకాయిల విడుదల విషయంలో ప్రభుత్వం స్పందించక పోతే.. సెప్టెంబర్ 4వ తేదీన రేషన్ డీలర్లంతా అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలానే రేషన్ బియ్యం పంపిణీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. ఇప్పటికే తాము అన్ని జిల్లాల కలెక్టర్లకు, సివిల్ సప్లై అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించి.. ప్రభుత్వం రేషన్ డీలర్లకు సుమారు ఐదు నెలల కమీషన్ బకాయిలు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించి డీలర్లకు కమిషన్ బకాయిలను చెల్లించలేదు. అలానే జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుదారు లందరికి ఒకేసారి 3 నెలల

రేషన్ బియ్యం పంపిణీ చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన కమీషన్ కూడా చెల్లించలేదని డీలర్లు తెలిపారు. అంతకు ముందు రెండు నెలల కమీషన్ కూడా చెల్లించ లేదన్నారు. దీనికి సంబంధించి నెలకు రూ.25 కోట్ల చొప్పున.. 5 నెలలకు కలిపి 125 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు.

# 20 కి.మీ. మేర నిలిచిన వాహనాలు



తెలంగాణ: పలు జిల్లాలను కుండపోత వానలు అతలాకుతలం చేశాయి. గంటల తరబడి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలోకి వెళ్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇండ్లు, పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. రోడ్ల మీదకు తీవ్ర స్థాయిలో వరద నీరు చేరడంతో చాలా చోట్ల రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కుంగిపోగా.. మరి కొన్ని చోట్ల కొట్టుకుపోయాయి. ఈక్రమంలో ఓ చోట రోడ్డు బాగా దెబ్బతినడంతో.. భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు 20 కిమీ మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆ వివరాలు..

కామారెడ్డి జిల్లాల్లో గత రెండు రోజులుగా కురిసిన కుండపోత వానకు నేషనల్ హైవే 44 బాగా దెబ్బతిన్నది. దీంతో ఈ మార్గంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎంతలా అంటే.. సదాశివ నగర్ నుంచి పొందుర్తి వరకు.. సుమారు 20 కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడివి అక్కడ నిలిపోయాయి. ఈక్రమంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గం పూర్తిగా బ్లాక్ అయింది. అలానే క్యాసంపల్లి వద్ద హైవే కుంగిపోయింది. దీంతో ఈ రూట్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

ఈక్రమంలో అధికారులు ప్రయాణికులకు కీలక అలర్ట్ జారీ చేశారు. కామారెడ్డి నుండి హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన వారు తాత్కాలికంగా ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని.. లేదా వేరే మార్గాల ద్వారా హైదరాబాద్ చేరుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా హైవే ఎక్కవద్దన్నారు.

కామారెడ్డిలో రెండు రోజుల క్రితం అనగా మంగళవారం రాత్రి నుంచి మరుసటి రోజు అనగా బుధవారం సాయంత్రం వరకు కుండపోత వాన కురిసింది. గంటల తరబడి ఏమాత్రం గ్యాప్ లేకుండా వాన కురవడంతో.. కామారెడ్డిలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. భిక్కనూర్ మండలం జంగంపల్లి వద్ద భారీ వరద వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనికి తోడు.. రోడ్డు మధ్యలో.. సుమారు 20 అడుగుల వెడల్పుతో పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు అటు వెనక్కి వెళ్లలేక, ఇటు ముందుకు కదిలే మార్గం లేక.. గంటల కొద్ది రోడ్డు మీద పడిగాపులు కాస్తు నరకం చూశారు.

నిజామాబాద్ జిల్లా, ఇందల్వాయి గేటు వద్ద భారీ వరద వల్ల.. ఎన్‌హెచ్ 44పై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. బీబీపేట-కామారెడ్డి , హైదరాబాద్-బోధన్ మార్గాల్లో.. రోడ్లు, హైలెవల్ వంతెనలు కొట్టుకుపో యాయి. ఇదిలా ఉంటే పోచారం వరద ఉద్ధృతికి మెదక్ జిల్లాలోని జాతీయ రహదారి కోతకు గురవ్వడంతో.. కామారెడ్డి-మెదక్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

# డెబ్బ్యూ హీరోకి విలన్‌గా డైలాగ్ కింగ్!



సూపర్‌స్టార్ కృష్ణ పెద్ద కుమారుడు రమేష్‌బాబు కొడుకు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇస్తున్న సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. ఆర్‌ఎక్స్ 100, మంగళవారం వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా థడాని నటిస్తోంది. ఇక విలన్ పాత్ర కోసం దర్శకుడు సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబును సంప్రదించగా, ఆయన కథ విని వెంటనే ఒప్పుకున్నారని సమాచారం. ఈ వార్త నిజమైతే జయకృష్ణ తొలి సినిమా సెన్సేషనల్ కాంబినేషన్‌తో రాబోతుందనే చెప్పాలి.

సినీ ఇండస్ట్రీలో ఓ వెలుగు వెలిగి కొద్దికాలం గ్యాప్ తీసుకుని మళ్లీ రీఎంట్రీతో గుర్తింపు తెచ్చుకుంటున్నారు చాలామంది సెలబ్రెటీలు. గతంలో హీరోలుగా చేసిన వారు ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా, విలన్లుగా తమలోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తున్నారు. శివాజీ, జగపతిబాబు లాంటి వారు సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ రాణిస్తూ ప్రేక్షకులతో జేజేలు కొట్టించుకుంటున్నారు. వీరి బాటలోనే కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు నడుస్తున్నారు. చాలాకాలం తర్వాత 'కన్నప్ప' ద్వారా వెండితెరపై కనిపించిన ఆయన ఇప్పుడు ఓ డెబ్బ్యూ హీరో సినిమాలో విలన్‌గా నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

సూపర్‌స్టార్ కృష్ణ పెద్ద కుమారుడైన రమేష్‌బాబు కొడుకు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి ఆర్‌ఎక్స్ 100, మంగళవారం వంటి హిట్ చిత్రాల ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహించనున్నాడు. ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ హీరోయిన్ రవీనా టాండన్ కుమారెత రాషా థడాని హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రంలో విలన్‌గా సీనియర్ నటుణ్ణి తీసుకోవాలని అజయ్ భూపతి అనుకుంటున్నాడట. ఈ క్రమంలోనే మంచు మోహన్‌బాబుని ఆయన సంప్రదించారట. స్టోరీ వినగానే ఇంప్రెస్ అయిన మోహన్‌బాబు విలన్ రోల్ చేసేందుకు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఈ వార్త నిజమైతే నిజంగానే సెన్సేషనల్ న్యూస్ అనే చెప్పాలి.

మోహన్‌బాబు ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో విలన్ పాత్రలు వేసిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి, మోహన్‌బాబు, నాగార్జున, వెంకటేష్ తదితర పెద్ద హీరోలకి ఆయన విలన్‌గా నటించారు. ఆ తర్వాత రూటు మార్చి హీరోగానూ ఎన్నో అద్భుతమైన చిత్రాలు తీశారు. డైలాగ్ చెప్పడంతో ఆయన చూపించే డిఫరెన్స్ ఆయన్ని డైలాగ్ కింగ్‌ని చేసింది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటోన్న మోహన్‌బాబు ఇటీవలే తన కుమారుడు మంచు విష్ణు స్వీయ నిర్మాణంలో వచ్చిన 'కన్నప్ప'లో నటించి మెప్పించారు. పాత నటులంతా సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టి రాణిస్తున్న తరుణంలో మోహన్‌బాబు కూడా మంచి కథలు వస్తే నటించడానికి సిద్ధంగా ఉన్నారట. ఈ క్రమంలోనే అజయ్ భూపతి ఆయన్ని సంప్రదించి కథ చెప్పగా చేస్తానని హామీ ఇచ్చారట. తన కుమార్తె మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తోన్న 'దక్ష' చిత్రంలో మోహన్‌బాబు ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. నాలుగేళ్ల క్రితం ఈ చిత్రాన్ని 'అగ్ని నక్షత్రం' పేరుతో ప్రకటించగా కొన్ని అవాంతరాలతో ఆగిపోయింది. తాజాగా 'దక్ష'గా పేరు మార్చుకుని ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమైంది. తాజాగా విడుదల చేసిన టీజర్ ప్రేక్షకుల్ని బాగానే ఆకట్టుకుంటోంది. క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో రానున్న ఈ చిత్రాన్ని మంచు లక్ష్మి స్వయంగా నిర్మించడం విశేషం.

# 'స్పిరిట్' షూటింగ్ మళ్లీ వాయిదా?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం 'ది రాజా సాబ్', 'ఫౌజీ' చిత్రాలతో బిజీగా ఉన్న ఆయన త్వరలోనే ' స్పిరిట్ ' యూనిట్‌తో చేరనున్నట్లు వార్తలొస్తున్నాయి. దాంతో పాటు కల్కి 2, సలార్ 2 చిత్రాలు లైన్లో ఉన్నాయి. 'ది రాజా సాబ్' డిసెంబర్ 5న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించగా ఆ చిత్రం వాయిదా పడే అవకాశాలున్నాయని తెలుస్తోంది. మరోవైపు 'ఫౌజీ' కూడా వచ్చే ఏడాది ప్రేక్షకుల మందుకు రానుంది. ఇప్పుడు ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు అందరి ఫోకస్ సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్లో తెరకెక్కనున్న 'స్పిరిట్' పైనే ఉంది. దీనికోసం ప్రభాస్ బల్క్ డేట్స్ కేటాయించనున్నాడని తెలుస్తోంది. డార్లింగ్ తన కెరీర్లోనే తొలిసారి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా పనిచేస్తుండటంతో ఫ్యాన్స్‌కి క్యూరియాసిటీ పెరిగిపోతోంది. పైగా ఇందులో కొరియన్ స్టార్ డాన్‌లీ విలన్‌గా నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ మూవీలో తరుణ్, మడోన్నా సెబాస్టియన్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటించబోతున్నట్లు సమాచారం. ఇందులో ప్రభాస్‌కి తండ్రిగా మెగాస్టార్ చిరంజీవి నటించనున్నారని వార్తలొస్తున్నాయి. దీనిపై మేకర్స్ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

అన్నీ సక్రమంగా జరిగితే 'స్పిరిట్' షూటింగ్ ఇప్పటికే మొదలుకావాల్సి ఉండగా కానీ కొన్ని కారణాలతో వాయిదాలు పడుతూ వస్తోంది. ఇప్పటికే సందీప్ రెడ్డి వంగా ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేయడంతో సెప్టెంబర్ రెండో వారం నుంచి షూటింగ్ మొదలవుతుందని వార్తలొచ్చాయి. ఆ తర్వాత అక్టోబర్ అని ప్రచారం జరిగింది. తాజాగా వినిపిస్తోన్న సమాచారం ప్రకారం.. 'స్పిరిట్' డిసెంబర్‌కి షిఫ్ట్ అయిందట. ప్రీ ప్రొడక్షన్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉండటం, ప్రభాస్ ఇతర సినిమాలతో బిజీగా ఉండటంతో ఇప్పట్లో షూటింగ్ కష్టమని మేకర్స్ అనుకుంటున్నారట. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ నుంచి ఈ చిత్రాన్ని సెట్స్ మీదకి తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారట. అయితే ఎప్పుడో మొదలు కావాల్సిన ఈ సినిమా షూటింగ్ పదే పదే వాయిదా పడుతుండటంతో ఫ్యాన్స్ ఫీలవుతున్నారు.

'స్పిరిట్' మూవీలో ముందుగా దీపికా పదుకొణెని హీరోయిన్‌గా తీసుకోగా కొన్ని కారణాల చేత ఆమెను తప్పించారు. తర్వాత 'యానిమల్' బ్యూటీ త్రిప్తి దిమ్రిని తీసుకు న్నారు. ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజా సాబ్' మూవీలో నటిస్తున్నాడు. ఈ చిత్రానికి సంబంధించి మారుతి కొన్ని సీన్లు రీషూట్ చేస్తుండటంతో ప్రభాస్ మళ్లీ డేట్స్ కేటాయిం చాల్సి వచ్చిందట. మరోవైపు తను 'ఫౌజీ' షూటింగులోనూ పాల్గొంటున్నాడు. ఈ రెండు సినిమాల కారణంగా ప్రభాస్ 'స్పిరిట్' మూవీకి డేట్స్ కేటాయించలేకపోతున్నాడని, అందుకే డిసెంబర్ వరకు ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యే అవకాశం లేదని తెలుస్తోంది.

# 'ఘాటి'ని టెన్షన్ పెడుతోన్న అనుష్క!



సెప్టెంబర్ 5న విడుదల కాబోతున్న ఘాటీ ప్రమోషన్లలో అనుష్క శెట్టి పాల్గొనబోరని నిర్మాత రాజీవ్ రెడ్డి స్పష్టం చేశారు. ముందే ఉన్న టర్మ్స్ ప్రకారం ఆమె ప్రీ రిలీజ్ ఈవెంట్ లేదా వీడియో ఇంటర్వ్యూల్లో కనిపించే అవకాశం లేదన్నారు. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి టైంలో నవీన్ పోలిశెట్టి ఒంటరిగా ప్రమోషన్లను మోయగా, ఘాటీలో హీరో విక్రమ్ ప్రభు తెలుగు ప్రేక్షకుల్లో పెద్దగా పాపులర్ కాకపోవడం వల్ల ఆ లోటు మరింత స్పష్టమవుతుందని అంటున్నారు. దీంతో ప్రమోషన్ల భారమంతా డైరెక్టర్ క్రిష్ మీదే పడింది. తెలుగులో స్టార్ హీరోయిన్ హెూదా అనుభవించిన అనుష్క శెట్టి అలియాస్ స్వీటీ ఈ మధ్యకాలంలో సినిమాలు తగ్గించేసిన సంగతి తెలిసిందే. కెరీర్ పీక్స్‌లో ఉన్న సమయంలో 'సైజ్ జీరో' చిత్రం కోసం బరువు పెరగడం ఆమెకు మైనస్ అయింది. ఎంత ప్రయత్నించినా చాలాకాలం బరువు తగ్గలేకపోవడంతో చాలా అవకాశాలు కోల్పోయింది. ఈ క్రమంలోనే చూస్తూ చూస్తూ వయసు 40ప్లస్ దాటేయడంతో సన్నగా అయినా మేకర్స్ ఆమెకు ఛాన్సులు ఇవ్వలేదు. ఇటీవల 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఓ మోస్తరు హిట్ అందుకున్న అనుష్క తాజాగా ' ఘాటి 'తో మంచి కమ్‌బ్యాక్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అనుష్క గిరిజన మహిళగా పవర్‌ఫుల్ రోల్‌లో నటిస్తోంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రం ఎన్నో వాయిదాల తర్వాత సెప్టెంబర్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమైంది. గతంలో క్రిష్, అనుష్క కాంబినేషన్లో వచ్చిన 'వేదం' హిట్ కావడంతో 'ఘాటి'పై మంచి అంచనాలు నెలకొన్నాయి.

సినిమా రిలీజ్‌కి ఇంకా వారం రోజులే ఉండటంతో యూనిట్ ప్రమోషన్ల జోరు పెంచింది. అయితే ఈ ప్రమోషన్లో అనుష్క ఎక్కడా కనిపించడం లేదు. దీంతో ఆమె ఎక్కడని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. అయితే సినిమాకి సైన్ చేసినప్పుడే ప్రమోషన్స్‌కి రానని అనుష్క చెప్పినట్లుగా తెలుస్తోంది. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో నిర్మాతల్లో ఒకరైన రాజీవ్ రెడ్డి తెలిపారు. గతంలో 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా విషయంలోనూ అనుష్క ఇలాగే చేసింది. అందుకే నవీన్ పోలిశెట్టి ఒక్కడే ప్రమోషన్లు చేసుకున్నాడు. 'ఘాటి' చిత్రానికి అనుష్క, క్రిష్ మాత్రమే అట్రాక్షన్‌గా నిలుస్తున్నారు. ఇందులో హీరోగా నటించిన విక్రమ్ ప్రభుకి తెలుగులో అస్సలు క్రేజ్ లేదు. దీంతో ఇప్పుడు ప్రమోషన్ల భారమంతా డైరెక్టర్ క్రిష్‌పైనే పడింది. 'ఘాటి' కంటెంట్ పరంగా అందరినీ ఆకట్టుకుంటోంది. అనుష్క మరీ వైలెంట్‌గా కనిపిస్తుండటంతో సినిమా విషయం ఉందని ప్రేక్షకులు అనుకుంటున్నారు. ఫస్ట్ డే పాజిటివ్ టాక్ వచ్చిందంటే చాటు సినిమాని ఎవ్వరూ ఆపలేరనే చెప్పాలి.

# హీరోగా సెన్సేషనల్ డైరెక్టర్..



'టూరిస్ట్ ఫ్యామిలీ'తో సంచలనం సృష్టించిన దర్శకుడు అభిషన్ జీవింత్.. ఇప్పుడు హీరోగా మారుతున్నారు. మదన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వినాయక చవితి సందర్భంగా అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఇందులో మలయాళ బ్యూటీ హీరోయిన్‌గా నటించనున్నారు. గతంలో అనేక మంది తమిళ దర్శకులు బిగ్ స్క్రీన్ మీద యాక్టర్స్ గా రాణించారు. మరి అభిషన్ జీవింత్ హీరోగా ఏ మేరకు ఆకట్టుకుంటాడో, ఈ సినిమా ఎలాంటి అనుభవాన్ని మిగులుస్తుందో వేచి చూడాలి. టూరిస్ట్ ఫ్యామిలీ ' సినిమాతో టాక్ ఆఫ్ ది సౌత్ ఇండస్ట్రీగా మారిన డైరెక్టర్ అభిషన్ జీవింత్. మానవ సంబంధాలను అద్భుతంగా తెరకెక్కించి బాక్సాఫీస్ దగ్గర ఘన విజయం సాధించాడు. డెబ్యూతోనే సంచలనం సృష్టించిన ఈ దర్శకుడు.. సూపర్ సార్ రజనీకాంత్, ఎస్.ఎస్ రాజమౌళి లాంటి దిగ్గజాల నుంచి ప్రశంసలు అందుకున్నారు. దీంతో అభిషన్ ఈసారి ఎలాంటి సినిమాతో వస్తాడో అని ఆడియన్స్ ఎదురు చూస్తున్నారు. అయితే ఈ కుర్ర డైరెక్టర్ మెగాఫోన్ పక్కన పెట్టి, కెమెరా ముందుకు రావాలని నిర్ణయించుకున్నాడు. హీరోగా ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయ్యాడు. అభిషన్ జీవింత్ హీరోగా తెరంగేట్రం చేయనున్నాడని ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇదే విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రజనీకాంత్ కూతురు సౌందర్య రజనీకాంత్ ప్రొడక్షన్ లో అభిషన్ హీరోగా పరిచయం కాబోతున్నారు. ఇందులో 'రేఖాచిత్రం' ఫేమ్ అనశ్వర రాజన్ హీరోయిన్ గా నటించనుంది. "ఈ ఏడాది 'టూరిస్ట్ ఫ్యామిలీ' వంటి బ్లాక్ బస్టర్ మూవీని తీకెక్కించిన డైరెక్టర్ అభిషన్ జీవింత్ ను పవర్ ఫుల్ న్యూ అవతార్ లో ఆవిష్కరించబోతున్నాం. మలయాళ చిత్ర పరిశ్రమలో వరుస విజయాలను అందుకుంటున్న టాలెంటెడ్ యాక్ట్రెస్ అనశ్వర రాజన్ ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తున్నారని ప్రకటించడానికి మేము సంతోస్తున్నాం" అని చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. ఈ సందర్భంగా సాంకేతిక నిపుణల వివరాలను కూడా వెల్లడించారు.

# చిన్నవాడైనా శిరస్సు వంచి దండం పెడుతున్నా

'హనుమాన్' హీరో తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో నటించిన పాన్ ఇండియా సినిమా 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్ గా నటించగా.. శ్రియ, జగపతి బాబు, జయరామ్ కీలక పాత్రలు పోషించారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో రూపొందిన ఈ సినిమా సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ట్రైలర్ ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఈవెంట్ లో తేజ సజ్జా, మంచు మనోజ్, శ్రియతో పాటుగా దర్శక నిర్మాతలు పాల్గొన్నారు.

మంచు మనోజ్ మాట్లాడుతూ.. "ఈరోజు ఈ స్టేజ్ మీద నిలబడటం వెనుక మూడు సంవత్సరాల కృషి ఉంది. ఎన్నో కలలు.. ఎన్నో ఆశలు పెట్టుకొని 'మిరాయ్' జర్నీ స్టార్ట్ చేశాం. మూడేళ్ల క్రితం తమ్ముడు తేజ కాల్ చేసి, ఒక సినిమా అనుకుంటున్నామని కార్తిక్ తో కలిసి నా దగ్గరకు వచ్చి కథ చెప్పాడు. బ్లాక్ స్వార్డ్ గా చేయాలని నన్ను అడిగారు. ఆ బ్లాక్ స్వార్డ్ ఇప్పుడు 2.0 లాగా వచ్చేసాడు. ఒక మంచి స్క్రిప్ట్ తో నేను ఆ పాత్ర చేయగలనని నన్ను వెతుక్కుంటూ వచ్చిన తేజ, కార్తీక్ కి థ్యాంక్స్. 'హనుమాన్' లాంటి ఒక నేషనల్ సూపర్ డూపర్ హిట్ ఇచ్చిన తర్వాత ఎవరైనా వెంట వెంటనే సినిమాలు సైన్ చేద్దాం, నాలుగు డబ్బులు వెనకాల వేసేసుకుందాం అనే మైండ్ సెట్ లో ఉంటారు. దాంట్లో తప్పులేదు. తేజ ఎంతో కష్టపడి వచ్చాడు. కానీ హనుమాన్ తర్వాత మూడేళ్లు ఆగి ఈ సినిమాతో వస్తున్నాడంటే అతని డెడికేషన్ ఏంటో అర్థమవుతుంది" అని అన్నారు.



"డైరెక్టర్ కార్తీక్ నాకు ఎమోషన్. అతని టాలెంట్ ముందు ఎవరైనా చిన్నబోతారు. నాకు సినిమా గురించి కొంత తెలుసు అనుకున్నాను. కానీ ఆయన్ను కలిసాక తెలిసింది నాకు సినిమా గురించి ఏమీ తెలియదని. మళ్ళీ ఫస్ట్ కి వెళ్ళిపోయి సినిమా గురించి నేర్చుకుంటున్నాను. అంత బ్రిలియంట్ డైరెక్టర్ అతను. ఆరేడేళ్ల క్రితం రాసుకున్న కథ. అశోకుడు తొమ్మిది పుస్తకాల గురించి చెప్పాలి.. మన హిస్టరీని ఎలాగైనా ముందుకి తీసుకెళ్ళాలనేది కార్తీక్ విజన్. సినిమా చాలా బాగా తీశాడు. హాలీవుడ్ స్టైల్ లో, ఇంటర్నేషనల్ స్టైల్ లో సినిమా తీయాలని అందరికీ ఆశ ఉంటుంది. ఆయనే డైరెక్టర్ గా డీఓపీగా చేయడం అంత ఈజీ కాదు. హ్యాట్సాఫ్ కార్తీక్. వయసులో చిన్నవాడైనా శిరస్సు వంచి దండం పెడుతున్నాను. అతని గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొని ఇక్కడిదాకా వచ్చారు. ఈ సినిమాలో నాకు అవకాశం ఇచ్చినందుకు థ్యాంక్స్"అని మంచు మనోజ్ అన్నారు.

# ఎలాంటి తప్పు చేయలేదు..

ఐటీ నిపుణుడిని కిడ్నాప్ చేసిన దాడి చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోసం కేరళ హైకోర్టును ఆశ్రయించిన నటి లక్ష్మి మీనన్‌కు అరెస్టు నుంచి తాత్కాలిక రక్షణ లభించింది. జస్టిస్ బెచు కురియన్ థామస్ నేతృత్వంలోని కోర్టు సెప్టెంబర్ 17 వరకు ఆమెను అరెస్ట్ చేయరాదని ఆదేశించింది. కొచ్చిలోని ఒక పబ్‌లో జరిగిన వాదన ఈ సంఘటనకు కారణమని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. అయితే లక్ష్మి మీనన్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ, కేసు తన ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశ్యంతో సృష్టించబడిందని తెలిపారు.

మలయాళ నటి లక్ష్మి మీనన్ పై కిడ్నాప్ కేసు నమోదు కావడం కలకలం రేపుతోంది. కొచ్చిలో ఓ ఐటీ ఉద్యోగిని కిడ్నాప్ చేసి దాడి చేశారన్న ఆరోపణలతో లక్ష్మితో పాటు ఆమె స్నేహితులపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ముగ్గురిని అరెస్ట్ చేయగా.. లక్ష్మి మీనన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆమె పేరును ఇంకా ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదని కొచ్చి నగర పోలీస్ కమిషనల్ విమలాదిత్య తెలిపారు. మరోవైపు తనను పోలీసులు అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ కోసం లక్ష్మి మీనన్ కేరళ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బెచు కురియన్ థామస్ నేతృత్వంలో ధర్మాసనం సెప్టెంబర్ 17 వరకు ఆమెను అరెస్ట్ చేయరాదని ఆదేశాలు జారీచేసింది.



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొచ్చిలోని వెలాసిటీ అనే పబ్‌లో లక్ష్మి మీనన్, ఐటీ ఉద్యోగి మధ్య వివాదం తలెత్తింది. ఇద్దరూ కాసేపు వాదులాడుకున్న తర్వాత ఐటీ ఉద్యోగి వెళ్లిపోగా లక్ష్మిమీనన్ తన స్నేహితులతో కలిసి అతడిని కారులో వెంబడించింది. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో నార్త్ రైల్వే బ్రిడ్జి దగ్గర కారును అడ్డగించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని లక్ష్మి మీనన్ బ్యాచ్ బలవంతంగా తమ కారులోకి ఎక్కించుకున్నారు. కారులోనే అతడిపై దాడికి పాల్పడి అలువా-పరపూర్ జంక్షన్ వద్ద వదిలేసి వెళ్లిపోయారు. దీంతో బాధితుడు అక్కడి నుంచి నేరుగా పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఐటీ ఉద్యోగిని కారులో తీసుకెళ్తోన్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డు కావడంతో పోలీసులు వాటిని సేకరించి నిందితుల్ని అరెస్ట్ చేశారు. లక్ష్మీమీనన్ పరారీలో ఉండటంతో ఆమె గురించి గాలింపు చేపట్టారు.



# విజువల్ వండర్‌గా 'మిరాయ్' ట్రైలర్..

తేజ సజ్జా హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'మిరాయ్' ట్రైలర్ విడుదలైంది. రితికా నాయక్ హీరోయిన్ గా నటిస్తుండగా, మంచు మనోజ్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా, విజువల్ వండర్ లా ఉంది. అత్యాధునిక వీఎఫ్ఎక్స్, నేపథ్య సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

తేజ సజ్జా హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఈ పాన్ ఇండియా మూవీ తెరకెక్కుతోంది. ఇందులో రితికా నాయక్ హీరోయిన్ గా నటిస్తుండగా.. మంచు మనోజ్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ జనాలను ఆకట్టుకుంది. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. "ఈ ప్రమాదం ప్రతీ గంధాన్ని చేరబోతోంది" అనే వాయిస్ తో ప్రారంభమైన ఈ ట్రైలర్ విజువల్ వండర్ లా ఉంది. దాదాపు 3 నిమిషాలతో ఈ వీడియోని కట్ చేశారు. వీఎఫ్ఎక్స్ నెక్స్ట్ లెవల్ లో ఉన్నాయి. బ్యాగ్రౌండ్ స్కోర్ బాగుంది. సెప్టెంబర్ 12న ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మిరాయ్' మూవీ సెప్టెంబర్ 12న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.